క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని గ్రామ సచివాలయం–2 పరిధిలో ఉన్న టీచర్ తిమ్మారెడ్డితోట కాలనీలో నివాసం ఉంటున్న మట్టా తిరుపతి భార్య మట్టా నాగలక్ష్మి (46) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో సచివాలయ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, బూత్ కన్వీనర్ జగదీశ్వరరెడ్డి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇన్‌చార్జ్ ఏఈగా శేఖర్

బేతంచెర్ల: మండల హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి అవుకు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బుగ్గానిపల్లె గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్ ఇన్‌చార్జ్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందరి సహకారంతో లబ్ధిదారుల సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు

కొలిమిగుండ్ల: 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. 01–04–2021 నుంచి 31–03–2022 వరకు రూ.11 కోట్లతో మండలంలోని గ్రామాల్లో వివిధ పనులు చేపట్టారన్నారు. ఈపనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు విచారణ చేపట్టారని చెప్పారు. ఆయా గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి ఈనెల 31న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

వర్క్ టూ రూల్‌కు సహకరించాలి

డోన్ టౌన్: సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన వర్క్ టూ రూల్‌కు సహకరించాలని ఏపీ రెవెన్యూశాఖ సర్వీసు అసోసియేషన్ డోన్ డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపు మేరకు వర్క్ టూ రూల్‌కు రెవేఎన్యూ సిబ్బంది వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కిషోర్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి సత్యదీప్, కోశాధికారి మధు, ఉపాధ్యక్షుడు మారుతి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్‌గా షాబాజ్ హుస్సేన్



డోన్ టౌన్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్‌గా షాబాజ్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాంట్రాక్టు పద్ధతిలో డాక్టర్ స్థానంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న షాబాజ్‌హుస్సేన్‌ను ప్రభుత్వం నియమించింది.

దేవాలయాల దొంగలను శిక్షించాలి

డోన్ టౌన్: దేవాలయాలల్లో దొంగతనాలకు పాల్పడుతున్నవారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే మహారాజ్, కార్యదర్శి ఆర్మీ రామయ్య కోరారు. పట్టణంలోని చాకిరేవు మిట్ట వద్ద ఉన్న పెరికేటి సుంకులమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన విషయం తెలుసుకున్న వారు గురువారం అక్కడికి వెళ్లి పూజారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఈ దేవాలయం సమీపంలో ఉన్న ఈశ్వరుని గుడి పూజారిపైదాడి చేసి శివలింగం తొలగించాలని దాడులు చేసారని ఆరోపించారు. ఈ విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి

ప్యాపిలి: పుట్టిన గంటలోపు శిశువులకు టీకాలు వేయించాలని, అలాగే ప్రతి నెలా టీకాలను క్రమం తప్పకుండా వేయాలని జిల్లా కన్సల్టెంట్ శ్రీలత అన్నారు. స్థానిక నాలుగో సచివాలయంలో గురువారం ఆమె టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్డ్ చెయిన్ మెయింటెనెన్సు ద్వారా ప్రతి చిన్నారికి టీకా వేయాలన్నారు. ఈ విషయంపై శిశువుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. టీకాలు వేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే పిల్లలు అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొనలేం... తినలేం!

- చికెన్ ధరలకు రెక్కలు
- ఇష్టారాజ్యంగా పెంచేస్తున్న వ్యాపారులు
- సామాన్యుడికి తప్పని నిరాశ



పట్టణంలోని చికెన్ సెంటర్(ఫైల్)

డోన్: చికెన్ ధర డోన్‌లో కొండెక్కింది. ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతుండడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఆదివారం అయినా ముక్క తిందామనుకునే పేదలకు నిరాశ తప్పడం లేదు. చికెన్ కొనలేం... తిననూ లేం అన్నట్లుగా ఉంది పరిస్థితి. కిలో అవసరమున్నా వారు అర కిలోతో సర్దుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కిలో రూ.140 ఉన్న ధర ఏకంగా రూ. 220 వరకు పెరిగింది. మాంసం ముక్క లేనిదే దిగని భోజన ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం డోన్‌తోపాటు ప్యాపిలి, బేతంచెర్ల మండలాల కేంద్రాలు, ఆయా గ్రామాల్లో దాదాపు 300 చికెన్ దుఖానాలు ఉన్నాయి. గ్రామాల్లో కనీసం 20 కేజీలు, మండల కేంద్రాల్లో 100 కేజీల వరకు చికెన్ విక్రయాలు జరుగుతాయని అంచనా. వ్యాపారుల ఐక్యత మూలంగా ధరలు అమాంతం పెరుగుతూనే ఉన్నాయి. వేసవి ప్రారంభంలోనే కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిందనే సాకును వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. కోళ్ల దానా, రవాణా ఖర్చులు పెరిగాయనే సాకు కూడా వాడుతున్నారు వ్యాపారులు. మాంసం ఎలాగూ తినలేం..కనీసం చికెన్ తిందామనుకున్నా ధర ఆకాశాన్నంటుతుందని సామాన్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో ప్రాంతంలో ఓ ధర !

చికెన్ ధర ఒక్కో ప్రాంతంలో ఓ ధర విక్రయిస్తున్నారు వ్యాపారులు. మండల కేంద్రం డోన్‌లో కిలో రూ. 220 అమ్ముతుండగా పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నమల్కాపురంలో కేవలం రూ. 140కే విక్రయిస్తున్నారు. అదేవిధంగా బేతంచెర్ల, సమీప వెల్దుర్తి (కర్నూలు జిల్లా) మండలాలో చికెన్ కిలో ధర రూ. 180 నడుస్తుంది. దీంతో వ్యాపారుల తీరును ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రాల్లో ఉన్న ధరను ఇక్కడ విక్రయిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి ఈ నెల 18వ తేదీన డోన్‌లో ఏకంగా కిలో చికెన్ రూ. 240 పెంచిన వ్యాపారుల తీరును డోన్ పట్టణ ప్రజలు తప్పుపడుతున్నారు. విపరీతంగా పెరిగిన చికెన్ ధరలను నియంత్రించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి..



చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ. 220 విక్రయిస్తున్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో లేని విధంగా ధరలను పెంచేశారు. కిలో అవసరం అయిన కుటుంబం అరకిలోతో సరిపెట్టుకునే పరిస్థితి నెలకొంది. మాంసం పూర్తిగా తినడం మానుకోవడం ఉత్తమం అని భావిస్తున్నాం.

– మోటా రాముడు, డోన్ పట్టణం.

ధరలు నియంత్రించాలి



చికెన్ ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. పొట్టేలు మాంసం ఇప్పటికే రూ. 900 పలుకుతూ కొనలేని పరిస్థితి. కనీసం చికెన్ తిందామనుకున్నా ధరలు అందుబాటులో లేవు. కిలో చికెన్ రూ. 220 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఆదివారం కూడా తినలేని పరిస్థితి నెలకొంది.

– గార్లపాటి మద్దిలేటి, చిన్న మల్కాపురం, డోన్ మండలం

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె: జిల్లాతోపాటు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వడగండ్లవాన మూలంగా వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, బాధిత రైతులను ఆదుకోవాలనిఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విన్నవించారు. ప్రధానంగా మిరప, మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పంటల సాగుకు అధిక పెట్టుబడులు పెట్టినట్లు ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. కిలో మిరప రూ.250లు గిట్టుబాటు ధర ఉందని, రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలోని బకాయిలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా కాటసాని సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని నివేదిక అందగానే రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం



సమావేశంలో మాట్లాడుతున్న జయదేవ్


కోవెలకుంట్ల: ఇటీవల కురిసిన అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంటనష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని వ్యవసాయ, ఉద్యానవన శాఖ జిల్లా అధికారులు జయదేవ్, నాగరాజు అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలోని గ్రామాల్లో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న మిరప, మొక్కజొన్న, వరి తదితర పంటలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని బాధిత రైతులు జిల్లా అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలతో పంటనష్టం జరిగిన ప్రతి ఎకరాకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనతంతరం సంబంధిత అధికారులతో వారు సమావేశమయ్యారు. పంటనష్టాన్ని పడక్బందీగా అంచనా వేసి నివేదికలు పంపాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు నిరంజన్, ధరణి, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ రూరల్: చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరమేశ్వరి సూచించారు. పట్టణంలోని ఏడవ నంబర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం టీచర్ లత ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ చేపట్టారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాలు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రమణ, రాజు, విమల, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సుగుణమ్మ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామ దేవతలకు బోనాలు



హుసేనాపురం గ్రామంలో సుంకులమ్మకు సమర్పించేందుకు బోనాలలో వెళ్తున్న మహిళలు

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం మహిళలు భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. బేతంచెర్ల, ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, ముద్దవరం, మర్రికుంట, హుసేనాపురం, గూటుపల్లె తదితర గ్రామాల్లో వెలసిన మారెమ్మ, సుంకులమ్మలకు మంగళవాయిద్యాల మధ్య మహిళలు సామూహికంగా బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మండ్లవానిపల్లె, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో గ్రామస్థాయి చిన్న బండలాగుడు పోటీలు నిర్వహించారు.

అవుకు: ఉగాది పండుగను పురష్కరించుకొని గురువారం మండల కేంద్రం అవుకులోని గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మెట్టుపల్లె రోడ్డులో వెలసిన మూలమ్మ ఆలయంలో బోనాల వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున భోనాలను తలపైపెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి మూలమ్మకు సమర్పించి మొక్కుబడులు చెల్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి చల్లంగా చూడు తల్లీ అంటూ ప్రార్థించారు. అలాగే కోటవీధిలోని పెద్దమ్మ, ఎస్కోటి ఎల్లమ్మ, కనుమమీది పెద్దమ్మ, మారెమ్మ, జమ్ములమ్మ, కుంటిమ్మ, సుంకులమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నవరం గ్రామంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు.



అవుకులో మూలమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి గురువారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీశోభకృత్ నామ ఉగాది కనుమ పండుగ పర్వ దినాన్ని పురష్కరించుకుని అర్చకులు విజయ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంతో పాటు చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

కోవెలకుంట్ల: ఉగాది పండగ సందర్భంగా గురువారం పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కోవెలకుంట్ల పట్టణంలోని సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అలాగే మండలంలోని గుళ్లదూర్తి, భీమునిపాడు, కంపమల్ల, అమడాల, లింగాల, రేవనూరు, కలుగొట్ల తదితర గ్రామాల్లో వెలసిన అమ్మవార్లకు మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు మహేశ్వర ఉన్నత పాఠశాల (2008–09 బ్యాచ్) పూర్వవిద్యార్థుల సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. దాదాపు 14 ఏళ్లతర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం కొండారెడ్డి దంపతులతో పాటు ఉపాధ్యాయులు నాగమణిరెడ్డి, రామకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారావు, కుమార స్వామియాదవ్, రాజాహుస్సేన్, వెంకటశివుడు, సుంకన్నకు పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాఘవగౌడ్,ఖాసీం, మద్దిలేటిస్వామి, అమర్, జి.లింగ, దూద్‌పీరా, నాగరాజు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ తహసీల్దార్‌పై సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు

డోన్: తహసీల్దార్ విద్యాసాగర్ తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని పట్టణంలోని కొండపేట వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి గంగాదేవి గురువారం ఆర్డీఓ వెంకటరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆమెతో పాటు పలువురు సచివాలయ మహిళ ఉద్యోగులు ఉన్నారు. ఈ విషయమై తహసీల్దార్ వివరణ ఇస్తూ విధి నిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగులను సహజంగానే మందలిస్తామన్నారు. అంతేకానీ వ్యక్తిగత ద్వేషం లేదని, తనకు మహిళలు అంటే ఎంతో గౌరవమన్నారు.

దొరపల్లిలో క్రికెట్ పోటీలు

డోన్ రూరల్: మండల పరిధిలోని దొరపల్లిలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రికెట్ పోటీలను బీజేపీ నంద్యా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన గెలుపు, ఓటమీలను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొట్టి మల్లికార్జున, మండల అధ్యక్షుడు మేడసిరి శివశంకర్, మోర్చా జనరల్ సెకరెటరీ దేవేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధిక తెలిపారు. స్థానిక నాల్గవ గ్రామ పంచాయతీ పరిధిలో రెండు ఖాళీలు ఉండగా బీసీ మహిళ, బీసీ జనరల్‌కు, గుళ్లదూర్తి గ్రామ సచివాలయ పరిధిలో ఓసీ జనరల్‌కు రిజర్వేషన్ కల్పించామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్యాపిలి: మండలంలోని పలు గ్రామాలు, వార్డులలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలచట్ల బీసీ జనరల్–1, మునిమడుగు బీసీ జనరల్–1, ప్యాపిలి ఒకటో సచివాలయంలో ఓసీ మహిళ–1, ప్యాపిలి మూడో సచివాలయంలో బీసీ మహిళ –1 చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25 వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వలంటీర్లు ఏప్రిల్ 1 వ తేదీ నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

బీజేపీ చేతగాని తనానికి నిదర్శనం

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్షాల నాయకులపై కేసులు బనాయించి శిక్షలు విధింపజేయడం బీజేపీ చేతగాని తనానికి నిదర్శనం అని డీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి, కార్యదర్శి ఉన్నగోర్ల జనార్దన్ విమర్శించారు. పురువు నష్టం కేసులో న్యాయస్థానం రాహుల్ గాంధీకి విధించిన రెండేళ్ల జైలు శిక్షపై గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మోడి, అమిత్‌షాలు దేశ సంపదను కొల్లగొడుతూ దేశం దాటించేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర సంస్థలతో ప్రతి పక్షనాయకులను బెదరింపులకు పాలుపడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చేచ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రెండురోజులపాటు వాహనాల మళ్లింపు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో 25, 26వ తేదీల్లో జరిగే శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాల నేపథ్యంలో రెండురోజులపాటు ట్రాఫిక్ నిబంధనలు విధించామని, భారీ వాహనాలను ఇతర మార్గాల నుంచి వెళ్లేలా చర్యలు తీసుకునట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. బనగానపల్లె నుంచి నంద్యాలకు వెళ్లు వాహనాలను టంగుటూరు, పసురపాడు మీదుగా, పాణ్యం నుంచి బనగానపల్లెకు వచ్చే వాహనాలను నందివర్గం, పలుకూరు మీదుగా మళ్లిస్తునట్లు తెలిపారు. భారీ వాహనదారులు విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన ఈశ్వర్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇలూర్లుకొత్తపేట గ్రామానికి చెందిన రైతు కొమ్మిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి(42) మిరప పంటకు నీరుకట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు షాక్ గురై మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఈశ్వర్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో మిరప సాగు చేశారు. సాయంత్రం పంటకు నీరు కట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా షాక్ గురై ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించి స్థానికులు వెంటనే చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీదేవి, ఒక కూతురు,ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.

గౌరవవేతనం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బనగానపల్లెరూరల్: పట్టణాలు, గ్రామాల్లోని ఎట్టిమాలలు ప్రభుత్వం గౌరవవేతనం ఇవ్వాలని కోరుతూ మాల శ్మశానవాటి కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోసుల ఇసాక్ మాట్లాడుతూ చాలా గ్రామాల్లో మాలలు బేగరులుగా ఉంటూ దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బేగరులుగా పని చేస్తున్న ఎట్టిమాలలకు ప్రభుత్వం రెండు ఎకారాలతోపాటు గౌరవవేతనంగా రూ.5వేలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బాలమద్దయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోలోమెన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్కాపురంలో సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

డోన్ రూరల్: మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అప్పుడే తల్లితోపాటు బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బద్దలనాగరాజు, ఎంపీటీసీలు చాట్ల సువర్ణ, తవిసి కొండ రామలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోక్‌మద్దయ్య, లక్ష్మన్న, సి.మద్దయ్య, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించండి

నంద్యాల: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో నిర్దేశించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులకు సూచించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా, శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు, విలేజ్, వార్డు సెక్రటేరియట్, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై కలెక్టర్లు, జేసీలతో చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా అనీమియా నివారణ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం గర్భిణులులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం

కోవెలకుంట్ల: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గురుసుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశం కోసం బ్రిటీష్‌వారిని ఎదిరించి చిన్నవయసులోనే ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శివప్రసాద్, శ్రీపతి, నాగేశుడు, నీరజ, సుగుణ, జ్యోతి, వరలక్ష్మి, జహీరాబీ, శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున, ఉసేనయ్య, బాబు, తిరుపతిరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు శివరాం, రామాంజనేయులు, నక్కిశ్రీకాంత్, చిన్న రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: స్థానిక నక్కిరామన్న భవనంలో గురువారం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో గురువారం భగత్ సింగ్ 92వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, మధు కిరణ్, షేక్షావలి, ఎల్లకృష్ణ, ప్రదీప్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం